వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కధలు- కబుర్లు



15.పూజ్యాయ చట్టం   16-03-26

పుణ్యమూర్తుల పరమోత్తమ రావు గారు అంటే కన్యా శుల్కం లోని పుణ్య మూర్తుల పురుషోత్తమ రావుగారికి
ఎనిమిదో తరపు మనుమడు . ఇప్పుడు మావూరి లోకెల్లా గట్టిగా సంపాదించిన లాయర్ గా వున్నాడు . ఈయనకు "బ్రెయిన్ హేమరేజీ" అనే దేదో వచ్చి నిన్ననో మొన్ననో హాస్పిటల్ లో వేశారు .

ఇహ నేనేమో మా సందులో అసలేమీ జరుగుతుందో తెలుసుకొని - దానిని సోషల్ మీడియాలో అప్లోడ్ చేసే ఇన్వెస్టిగేటింగ్ జర్నలిస్టు గా మారి వున్నాను .

నేను ఇన్వెస్టిగేషన్ మీద వెళ్లి - పీ పీ రావు గారి కి ఒక అసిస్టెంట్ లాయర్ ఉంటే, వెళ్లి ఆయన్ను కలిసి కేసు వివరాలు చెప్పండని అడిగాను .

ఆ అసిస్టెంట్ అన్నదేమిటంటే "మా లాయరుగారికి ఈ మధ్య కేసులలో పరాజయం శాతం పెరిగి భక్తి తత్వ చింతన పెరిగింది. పెరిగి ఒక గుడి కట్టించటం మొదలెట్టారు . ఆ వెంటనే - తన గుడిలో పూజారులు/ భక్తులు ఆచరించ వాల్సిన నియమ నిభంధనాల రూల్సును   "పూజా చట్టం " అనే పేరిట గ్రంధస్తం చేయటం మొదలెట్టారు . అనాదిగా వస్తూ వున్న అనేక నమ్మకాలతో తన స్వంత నమ్మకాలని కలగా పులగం చేసి చట్ట రూపం ఇవ్వటానికి పూనుకున్నారు . ఎవరైనా భక్తుడు గుడికొచ్చి , ఈ పూజా చట్టం ప్రకారం నడుచుకోక పోతే వారిని గుడి బయటకి ఈడ్చి శిక్షించటం అనేది లక్ష్యం గా పెట్టుకొని మా లాయర్ గారు ఈ చట్టం రాసుకుంటున్నాడు .

చట్టం లోని చాప్టర్ వన్ రూల్ వన్ గా "గుడికి వచ్చే ప్రతి భక్తుడూ   తెల్లారుఝామున నాలు గింటి కల్లా దేముని కి సుప్రభాతం పాడటానికి రావాలి.   ఈ రూలు రాసి పడేసి నాకా లాయర్ గారు తృప్తిగా ,హాయిగా రిలాక్స్ కూడా అయ్యారు   అప్పుడు నేను చూస్తూనే వున్నాను . మా లాయర్ గారు ఇట్లా రిలాక్స్ కాగానే దేముడు మా లాయరు గారి ముందు ఒక మెరుపుగా మెరిసి, అయన నెత్తిన ధడాలున ఒక మొట్టి కాయ వేసాడు. వేసి "ఎరా వెఱ్ఱికుంకా – నువ్వు వచ్చి సుప్రభాతం పాడితే కానీ నిద్ర లేవనంత - నిద్ర లేవాలని   తెలీనంత భద్దకస్తుడినా ? మీరు సుప్రభాతం పాడిందే కాక, నేను నిద్ర లేచినాకా చేయాల్సిన పనులేమిటో కూడా నాకు చెపూత్తుంటారు . అంటే నేను నిద్ర లేచినాకా - నేనేమి చేయాలో లో నువ్వు చెపితే తప్ప తెలుసుకోలేని వాజమ్మనా ? నేను సవా లక్ష పనులను చక్కదిద్ది ఎప్పటికో పక్క మీద పడతాను . నా మానాన నేను పడుకుంటే - నన్ను కమ్మటి సుఖ నిద్ర

ద్రవోనీయకుండా, నీ కీచుగొంతుతోనూ.. దానికి నీ భక్తుల కోరస్ తోనూ ఏమిట్రా నీ సుప్రభాతము - దానికొక రూలూనూ ? . నీ తెంపరి తనానికి బహుమతిగా ఇదిగో అందుకో ఓ టెంక జిల్లా "అంటూ మాలయర్ గారి నడినెత్తిన ఒక మొట్టి కాయ యిచ్చాడు . ఆలా మా లాయర్ సార్ వచ్చి ఈ హాస్పిటల్ లో పడ్డాడు "

వారణాసి ఉనా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి సొంత కథ

14.కపుల్స్ అండ్ కాంబినేషన్ 13-03-26

భార్య భర్త ఇద్దరూ అమరం డాక్టర్ గారి దెగ్గరికి వచ్చారు వచ్చి " అయ్యా డాక్టర్ గారూ మాకు పిల్లలు కలగటం లేదు అని ఫిర్యాదు చేశారు .

"మరి నా దెగ్గరికి వచ్చారేమమ్మా ? నేను సంతానం డాక్టర్ ని కాదు . పుట్టని సంతానాన్ని పుట్టించటం వేరే బ్రాంచి వాళ్ళ పని . " అని అయన అన్నాడు .

"అదంతా మాకు తెలియదండి . మీ దెగ్గరకు రావాలను కున్నాము . వచ్చాము . ముందు మా సంగతి వినండి" అని దంపతులు అన్నారు .

" సరేచెప్పండమ్మా " అని డాక్టర్ అమరం గారు సీటులో వెనక్కి వాలాడు .

భార్య అన్నది ఏమిటంటే " ఆయన ఉదయం టిఫిన్ తిని ఆఫీస్ కు బయలు దేరటానికి అరగంట ముందునుండి – రాత్రి డిన్నర్ ఐ పక్క ఎక్కటానికి అరగంట ముందు వరకూ నా మీద ఎంతో ప్రేమతో వుంటారు . నేను వోయి పక్కన పడుకోగానే ఆ ప్రేమంతా ఎటుపోతుందో తెలీదు అదీ మా సమస్య "

" అది నూరు పర్సెంటు నిజమేనండి డాక్టర్ గారూ .. నేను ఆఫీసుకు అని బయలు దేరగానే ఆమె మగ్గీ మగ్గని మామిడి పండులా, దానిమ్మ పండులా, దబ్బపండులా అవుపిస్తుంది . ఆమె వచ్చి పక్క మీద పడుకోగానే పెద్ద బూడిద గుమ్మడి కాయ వచ్చి పక్కంతా పరుచుకొని పడుకున్నట్లు ఆనిపిస్తుంది " అదీ నా సమస్య అన్నాడు భర్త .

చివరికి డాక్టర్ గారు తల గోక్కుని " చూడండమ్మా -"బ్రహ్మ గారు తనకు బోరు కొట్టకుండా - అనేక రకాల కంబినేషన్స్ తో జోడీలను ఏర్పరుస్తాడు .ఇది ఆయన ఫెవరెట్ కంబినేషన్ . వయసు ముదిరి నాకా పురుషులంతా ఇట్లాగే తయారీ కావాలని - స్త్రీలంతా ఆవకాయ లాంటి ప్రేమను అడగాలని అయన రూలు . ఏదేమైనా సరే , మీరు మీ ఆయనకు వయసు ముదురు తున్నదని తెలుసు కొని సర్దుకు పోవటం నేర్చుకోవాలే . బ్రహ్మ గారిని

గౌరవించుకోవడం నేర్చుకోవాలే. ఇట్లా మాలాంటి వాళ్ళ చుట్టూ తిరగటం మాని వేయాలే . బ్రహ్మం గారి రూల్స్ కి ఎదురీదే మందులు ఏవీ వుండవు. బ్రహ్మచారి ముదురు బెండకాయ అయినట్లు - పెళ్లయిన వాళ్ళు కూడా ముదురు బెండకాయలవుతారు . తిరిగి బ్రహ్మచారులవుతుంటారు . మీరు ఇదికూడా మనస్సులో ఉంచుకోవాలి " అన్నాడు .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కథ
13. బలి పీఠం 10-03-26

ఇది ఒక నిజ జీవిత కథ - ఒకాయన వున్నాడు - ఆయన ఓ RMP డాక్టర్ .ఈ RMP డాక్టర్ వూళ్ళో ఎంత అవసరమో అంత చులకన . అయన వద్దకు వచ్చే కేసుల్లో సగం సుఖవ్యాధులు కేసులు– ఇంకో సగం లో సగం గర్భస్రావం చేయమని వచ్చే కేసులు ఇంకో సగం నాకు జ్వరాలు – నాకు సిలైను పెట్టండి అనే వింత డిమాండ్ తో వచ్చే కేసులు.
డిమాండును పట్టి అంటే గర్భస్రావం చేయమని వచ్చే కేసుల కోసమని డాక్టర్ గారు ఒక నర్సుని నియమించుకున్నాడు . ఆమె పేరు మాల్లీశ్వరి . ఈమె మిడ్ వైఫ్ అనగా మంత్రసానిగా పని చేయటానికి అవసరమైన కోర్సు చదివింది . చదివి ఫ్యాసు అయినట్లు . గవర్న మెంట్ ఇచ్చిన సర్టిఫికెట్ కూడా వుంది .

మల్లేశ్వరి - ఈ డాక్టర్ గారితో కలిసి మంత్రసాని తనం బదులు గర్భస్రావాలు చేస్తున్నది . ఇందులో డాక్టర్ గారికి కూడా గిట్టు బాటుగా నే వున్నది . సంపాదిస్తూ నే వున్నాడు . ఇహ తమ కాంబినేషన్ చెడి పోకూడదు అని కాబోలు డాక్టర్ గారు మల్లేశ్వరితో " నీకు ఇల్లు కట్టించి ఇస్తాను నాతో ఉండిపో " అన్నాడు .

"నా వల్ల అంటే నేను చేసిన ఏబార్షన్ ల మూలకంగా సంపాదించినా దానిలోనించి నాకు ఖర్చు చేస్తున్నాడు ఖర్చు చేయక చస్తాడా? " అని – " నాకో ఇల్లు కట్టించి ఇస్తాను అన్నాడు అంటే నా మూలకంగా ఎంత సంపాదిస్తున్నాడో? అని కూడా మల్లేశ్వరి అను కున్నది .
అందుకని అయన ఇల్లు కట్టించి పెడుతూ ఉంటే ఈమె హెచ్చుకు పోయి ఇంటికి హంగులు చేయించటం మొదలెట్టింది . ఐదారు లక్షలు అవుతుంది అనుకున్నది పదిహేను లక్షలు ఐంది . ఈ డబ్బు మొత్తం డాక్టర్ గారు ఇవ్వలేదు . "అయన ఇవ్వక పోడు- నా చేత పని చేయించుకుంటున్నాడు - నన్ను వాడుకుని బలుస్తున్నాడు కాబట్టి" అనుకుంటూ ఈమె డాక్టరుగారికి తెలిసేట్లు గానే తన వంటిమీద బంగారం అమ్ముకొని ఇంటిమీద పెట్టింది . అట్లా పదిహేను లక్షలలో ఫది డాక్టర్ గారివి - ఐదు ఈమెవి అయ్యాయి .
అయినా ఇల్లు పూర్తిగాలేదు . ఇంకొన్ని లక్షలు ఇవ్వమని ఈమె అడిగింది . ఇళ్లు కట్టుడులో ఈమె దూకుడు వ్యయం చూసి అయన దడఁచుకొని " నేను ఇవ్వలేను -కావాలంటే నువ్వు వేరే చోట వుద్యోగం చూసుకోని పో "అని ఒక శాశ్వత పరిస్కారం చెప్పాడు . "వచ్చే డబ్బు

మించి ఎందుకు ఖర్చు చేయాలి?" అనే ఆలోచన కొద్దీ అయన అట్లా అన్నాడు అనుకుంటే ? అది సహజం కదా ?

"నువ్వు వుద్యోగం మానుకో" అని డాక్టరుగారు అన్న మరునాడు మల్లీశ్వరి ఎస్ సి ఎస్టి పెద్దలను కలిసి వారిద్వారా తన కులపు ఎం ఎల్ ఏ - ఎంపీ వంటి వారిని కలిసి - వారి సలహాలు మరియూ మద్దతుతో పోలీసు డీ ఎస్పీ గారిని కలిసి "ఆ డాక్టర్ గాడు నా చేయి పట్టుకొని లాగి నన్ను ఆగం చేసాడు -నాకులం పేరు పెట్టి నన్ను నిండించ్చాడు – అవమానించాడు . శీలం దోచాడు . నాకు నష్ట పరిహారంగా పాతిక లక్షలు ఇప్పించండి . ఆయనకు శిక్ష వేయించండి" అని అర్జీ ఇచ్చింది .

ఈమెకు న్యాయం చేయటం కన్నా మించి - ఇందులో డాక్టర్ నుండి ఎంతో డబ్బు గుంజుకో వచ్చు అన్న జ్ఞానం కల పెద్దలందరూ ఈమెకు మద్దతుగా నిలిచి - తొందరగా కేసు తేల్చమని పోలీసులను ఒత్తిడి పెట్టారు .
ఎస్ సి -ఎస్ టీ అనే యాక్టు ఒకటుందని అందరికి తెలుసు . ఎట్లా తెలుసు అంటే ఆ చట్టము దుర్వినియోగం అవుతోందని అనేక మంది మొత్తు కోవటంతో అది ఉందని -అందరికీ తెలిసింది .
"అయ్యా, మీరు ముందుకు సాగటానికి ఊత కర్రగా ఈ చట్టాన్ని వాడుకోండి" అని చెబితే– వారు దాన్ని కాదని ఈ చట్టాన్నిఎదుటివారిని దడిపించటానికి వాడే దుడ్డు కర్ర లాగా వాడుకుంటూ వున్నారు కాబట్టే జనం ఆ చట్టం గురించి తెలుసుకుని మొత్తు కుసేది.

ఇట్లాగా మన డాక్టర్ గారు బలిపీఠం ఎక్కాడు . అప్పుడు ఆయనిట్లా మొత్తుకున్నాడు ." దుడ్డు కర్రతో బాదినట్లు వాళ్ళు నా జీవితం పై తమ చట్టం తో బాది - వేరుశనగ గింజల్లోనుండి నూనె పిండినట్లు ఈనా నుండి డబ్బు పిండు కుంటున్నారు .. చేతికిచ్చిన ఊత కర్రని - దెబ్బకొట్టే దుడ్డు కర్రగా వాడుకుంటున్నందు వల్లే ఎంతకాలం గడిచినా - జనం వారిని తమలో ఒకరిగా చూడటం లేదని - ఇక ఎప్పటికీ చూడరని డాక్టర్ గారు మామూలు జనం ముందు ఆక్రోశించాడు . వారు కూడా అవునవ్వును అన్నారు .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ కల్పిత సొంత కథ

12. కడుపు తీపి - కడుపుమంట 09-03-26

నా చిన్నపుడు నాకు లేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు "నా పిల్లకు" వుండాలే అనుకుంటూ తన పిల్లను పెంచిన ఓ తల్లీ - పెంచబడ్డ ఆమె పిల్లా ఒక విషయం మీదా మాటా మాటా అనుకుంటున్నారు .

పిల్ల ఒక రూలు ఒక రైము లేకుండా , పద్ధతి పాడూ లేకుండా మొగపిల కాయలతో ఫ్రెండ్షిప్ చేస్తున్నదని , "అదంత మంచిది కాదు - నీ జోరు తగ్గా లే " అన్న పాయింట్ మీద తల్లి ఏమేమో అంటున్నది . తాను ఇచ్చిన స్వాతంత్రము లో - ఎంత వరకూ అవసరమో అంతవరకే వాడుకోవటం పిల్ల నేర్చుకోవాలని - పిల్ల ఎన్నడూ మోసానికి లోను కాకుండా కాపాడుకోవాల్సిన భాధ్యత తనదే అన్న కడుపుతీపితో - తల్లి తన కడుపు తీపిచేత పిల్లతో వాదము చేస్తున్నది .

"దీనమ్మ .. స్వాతంత్రము ఇచ్చినట్లే ఇచ్చి - కరెక్ట్ టైం వచ్చేసరికి వెనక్కి గుంజుకుంటున్నది" అని ఆ పిల్ల తన తల్లి గురించి ఫీల్ అవుతూ తల్లికి కౌంటర్ ఎటాక్ లు ఇస్తూ వున్నది .

"నీ కోసం ఆ మొగపిల్లలు ఇంటి చుట్టూ తిరగటం మాన్పించ లేక పోయావంటే నిన్ను గదిలో పెట్టి తాళం వేస్తాను అన్నది తల్లి .

" నాకు తెలుసులే . ఇప్పుడు నా చుట్టూ అబ్బాయిలు తిరిగినట్లు నీ చిన్నపుడు నీ చుట్టూ ఎవరూ తిరగలేదని నీకు కడుపు మంట" అని కూతురంది

మరి మీరైతే ఏమి బదులిస్తారు ? .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కథ

11.ఒత్తి అమాయకురాలు 07-03-26

ఒకమ్మాయి కడుపుతో ఉండగా పుట్టింటికి వచ్చింది .. కానీ ఆమె గర్భం నష్టమై పోయింది . అంటే ఆరు నెలలు రాకముందే యాబార్షన్ ఐంది నేటి అమ్మాయి లు పుట్టింటివారికి బరువేమీ కాదు . అందువల్ల ఈ అమ్మాయి సంవత్సరం మించి పుట్టినింట్లో నే అట్లా వున్నా కూడా ఎవరూ ఏమీ ఫీల్ అవలేదు . ఆదరంగానే చూసారు . ఎటొచ్చీ వచ్చిన చిక్కంతా ఆ పిల్ల మోగని తోనే వచ్చింది . అతడు వారానికి ఒకసారి అంటే ఆదివారం నాడు ఇంకా అతని ఉద్యోగానికి సెలవు రోజున ఈ పిల్ల దెగ్గరికి వచ్చి "కాపురానికి రా "అని మొత్తుకుంటూ వున్నాడు ..

చివరికి ఒకనాడు తన భందుమిత్రులు నలుగురిని వెంటేసుకొని అత్తారింటికి వచ్చి " కాపురానికి వస్తావా లేవా ?" అని పెండ్లాము మీద పంచాయతీ లేవదీశాడు ..

ఎంతో డిస్కషన్ తరువాత అమ్మాయి ఇట్లా అంది
" నీకు ఆ పని చక్కగా చేయటం వస్తలేదు . అందుకే నాకు కడుపు నిలవలేదు . చక్కంగా పని చేస్తానంటే నే వస్తాను"

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కధ

10. అమాయకురాలు **-** మాయ ముండాకొడుకు **03-03-26**

ఓ యాభై యేండ్లు నిండిన వనితకు అరవైలు నిండిన పురుషుడు పురుషోత్తమానికీ వివాహమైంది . ఇరువురికీ పునర్ వివాహమే .

ఈ వివాహము తర్వాత , తాము ఏ ఆస్తులు కోల్పోతామో తెలియక అయన కొడుకులు గందరగోళ పడ్డారు .

ఈ వివాహము తరువాత తాము పుట్టింటి నుంచి ఏమి కోరవచ్చో కోరకూడడో తెలియక ఆమె కుమార్తెలు వింత పడ్డారు .

ఉన్నట్లు ఉండి ఇరు పక్షాల వారికీ కొత్త అన్నలు తమ్ములు, అక్కలు చెల్లెల్లు , అత్తలు పిన్నులు దొరికారు.

బంధు వర్గము ఇబ్బడి ముబ్బడి ఐంది . ఈ బంధు వర్గములోని ఎవరో ఒకరికి అసలు ఈ వృద్ధుల పెండ్లి ఎలా సంభవమైంది ? అనే ప్రశ్న వచ్చింది . అయన రెట్టించి అడుగగా అడుగగా ఆమె ఇలా చెప్పింది . "' చాలా రోజుల పాటు -కేవలము కాళ్లు మాత్రమే ఉండి దేహము లేని పిల్లి ఒకటి కాళ్ళకు గజ్జెలతో నా ఇల్లంతా గెంతుతూ తిరుగు తున్నట్లుగా కలలు వచ్చినవి. నా మొదటి భర్త మరణము తరువాత రావటం మొదలైన ఈ కల వల్ల నేను ఎంత భయ పడి నిద్ర లేచే దానినో ఆ పరమాత్మునికే ఎరుక . ఇప్పుడు నన్ను పెండ్లి చేసుకున్న వారు నాకు పార్కులో పరిచమైనపుడు నేను నా భయాన్ని వారితో పంచుకున్నాను . అందుకు వారు నాకు ఎంతో ధైర్యము చెప్పి " నాకు కూడా మొండెము మాత్రమే ఉండి, కాళ్ళు లేని పిల్లి మెడలో గజ్జెతో ఇలంతా గెంతుతూ తిరుగుతున్నట్లు కలలు వాస్తవి. అప్పుడు నేను ఎంత భయముతో నిద్ర లేస్తానో ఆ పరమాత్మునికే ఎరుక . కాబట్టి మనము పెళ్లి చేసుకొని ఆ పిల్లికి సంపూర్ణ రూపము కల్పించి మన భయాలు పోగొట్టుకుందాము" అని చెప్పారు . అందుకని మేము మరలా పెండ్లి చేసుకున్నాము "

ఏమి మాయ మాటలు చెబితే ఆడవాళ్ళూ ప్రేమాకూ - పెళ్ళికి ఒప్పుకుంటారో అనేది మయా ముండ కొడుకులైన పురుషులకే తెలుస్తుంది . తమ ఇష్టా- అయిష్టాలేమిటో చెప్పుకోవం

ద్వారానూ లేదా హావభావాలలో చూపించటం ద్వారా నూ స్త్రీలు అమాయకురాళ్లు అవుతూ వుంటారు .

ఏ కారణంగా స్త్రీలు- పురుషులు మరో పెళ్ళికి ఒప్పుకుంటారో వారిని సృష్టించిన బ్రహ్మకు కూడా తెలియదు.

మా ఆయనకు జీతం బత్తెం రాని పని పెంచటానికి కాకా పోతే మరెందుకు ? అని సరస్వతి అనుకున్నది .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కథ

9.సొరకాయ కూర కథ **01-3-2**6

ఒకాయనకు బాగా గ్యాస్ వుంది . గుండెలకు ఎగతన్నుతూ వుండే గ్యాస్ . అయన వుండే వూరు చిన్న పల్లె టూరు . “ఎటునుండి ఎటు నడిచినా నాలుగడుగులే. ఈ మాత్రం దానికి మందులు కొని ఇంట్లో పెట్టు కోవటం దేనికి ?” అని అయన గ్యాస్ బిళ్ళలు ఇంట్లో పెట్టుకోడు . గ్యాస్ బిళ్ళలు ఇంట్లో ఉంటే వూరికే మింగ బుద్దేస్తుంది . ఓర్చుకోవాలని అనిపించదు “ అనేది అయన భార్య సిద్ధాంతము .

“బాగా గ్యాస్ అనిపిస్తోంది గుండెలను తన్ని పెడుతోంది . ఆలా మందుల షాప్ దాకా పోయొద్దం రా” అని అయన భార్యను సాయం కోరాడు .

“ఇదిగో నేనింకా నడవలేను. ఆ బిళ్ళ ఏమిటో ఈ మెడికల్ షాప్ లో అడిగి కొని వేసుకో “ అని భార్య ఆగింది . ఇట్లా రోడ్డు మీదకు వచ్చినందుకు అక్కడ అమ్ముతున్న కొబ్బరి బొండం తాగటం న్యాయం అని ఆమె అలోచాన కొద్దీ ఆమె అట్లా అంది.

ఈయన మెడికల్ షాప్ కి వెళ్లి అక్కడి బల్ల మీద చతికల పడ్డాడు .మెడికల్ షాప్ ఆయనకి ఈయన బాగా తెలుసును .
ఈ మనిషి నా దెగ్గర ఎప్పుడూ మందు బిళ్ళలు కొనడు అనే కారణంగా ఇంకా తెలుసు . అందువల్ల “ ఏ మా షాప్ ఇప్పటికి కనపడిందా ?’ అని మొదలెట్టాడు. ఇట్లా మొదలెట్టి నందువల్ల ఈయనకు అంటే గురవయ్యకు కావాల్సిన గ్యాసు బిళ్ళ గురవయ్య చేతిలో పడలేదు .

గురవయ్య భార్య బోండాము త్రాగుతూ భర్తకళ్ళే చూస్తూ ఉండగానే - అయన ఎదో తూలు వచ్చిన వాడిలా ముందుకు తూలి కిందపడ్డాడు . "సునాయాస మరణము - లక్కీ వాడు " అని అనుకోకుండా ఇది చూస్తున్న వారిలో ఒకడు అన్నాడు .

" గ్యాస్ బిళ్ళ ఇవ్వకుండా - ఎందుకాగానో . దేముడున్నాడు . లేకపోతే వాడు నేనిచ్చిన బిళ్ళకే చచ్చాడని ఎంత అల్లరి అయ్యేదో ? చెడ్డ పేరుకి - నా షాప్ శాశ్వతం గా మూసుకోవాల్సి వచ్చేది " అని మెడికల్ షాప్ అయన అనుకున్నాడు .

మెడికల్ షాప్ కి అంటుకొని ఒక ఆరెంపీ డాక్టర్ గారున్నాడు .
" అతడు నా క్లినిక్ లోపలి కి రాలేదు .నాకోసం రాలేదు . నా పేషేంట్ కాదు . నాకేం భయం లేదు" అనుకున్నాడు .

ఈ షాప్ కి ఎదురుగా రోడ్డుకు అవతలాగా ఇంకో మెడికల్ షాప్ ఇంకో ఆరెంపీ వున్నారు .

" రోజూ వచ్చేది కొనేదీ రూపాయ గ్యాస్ బిళ్ళ . ఇంకా నయం అలవాటలో అలవాటుగా మన షాప్ దెగ్గరికి రాకుండా అక్కడే చచ్చాడు " అనుకున్నాడు ఈ మెడికల్ షాప్ ఆయన.

" అప్పుడప్పుడూ వచ్చి గ్యాస్ కి ఇంజెషన్ చేయమని అడిగే వాడు . ఇవాళ కూడా అట్లాగే వచ్చి ఇంజెక్షన్ అడిగి ఉంటే అది నేను చేసి ఉంటే - వాడి చావు నా అకౌంట్ లో పడేది . పొద్దున్నే ఏ దేముడి ని చూశానో తప్పించుకున్నాను' అని రొండో ఆరెంపీ అనుకున్నాడు .

భార్య శోకాలు పెట్టటం వల్ల అయన ఎదో గ్యాస్ బిళ్ళ కోసం వచ్చి అట్లా చచ్చాడని జనం తెలుసు కున్నారు . అందులో ఒకాయన " నువేం వండి పెట్టవమ్మా ? అట్లా చచ్చాడు ? " అని అడిగాడు .ఆమె వంటలే అతని చావుకు కారణం అని తన అభియోగంఅయినట్లు .

" మన కెందుకు పదండి " అని ఒక భార్య భర్తను పట్టి లాగింది .ఎదో ఒక కూర మీదకు నేరం పోవటం ఇష్టం లేక .

" ఎం వండాను - సొరకాయనే గా ?" అని మృతుని భార్య అన్నది . ఆమె వండింది అది కాదు . కానీ కూరమీదకునేరం పోతే , ఆ నేరం తన మీదకు నేరం మళ్లకుండా ఆమె అట్లా అన్నది .

ఇందుమూలంగా మనకు తెలిసేది ఏమంటే "తన కూర మీదకు నేరము పోవటం ఏ స్త్రీకి నచ్చదు . నేరం చేసేది మీరు తినే మసాలా కూరలే అని ఏం డీ లు ఎం స్ లు - ఇట్లా అందరూ చెపుతారు . కానీ కూరల మీద నేరం వేయటం ఇష్టం లేని జనం అట్లాగే వండుతూ వుంటారు ,

తింటూ వుంటారు . సొరకాయ కూర ఏమీ చేయదు లేదా ఏ నేరమూ చేయదని ప్రతి ఒక్కరూ నమ్ముతారు .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కథ

9. రెండు గదుల మధ్య .. మూర్తి **28-02-26**

"రెండు గదుల మధ్య" అని ఇంతకు మునుపు రాసిన కథలో సంజనా మూర్తి అనే ఆయన ఇటు పడక గది అటు వంట గది మధ్యలో గల మెయిన్ హాలు లో పడుకునేట్లు చేసి ఆయన కథ ముగించాను .

కోటి రూపాయలు పెట్టి ఇల్లు కట్టుకున్న వాడిని అట్లాగా పెధవాయిని చేసి డ్రాయింగ్ రూమ్ లో ఎట్లా పడుకోపెడతారూ ? అని ఒకరు నన్ను ప్రశ్నించారు .

సంజనా మూర్తి పెధవాయి అవునో కాదో చెప్పటానికి ముందు అతనితో మాట్లాడితే మంచిగా ఉంటుందని భావించి . అతన్ని మాట్లాడించి , అతని మనస్సులోని మాట లేదా ఉద్దేశ్యము ఏమిటో కనుక్కొని అది ఇప్పుడు మీకు చెపుతున్నాను .

అ అతను అన్నది ఏమిటంటే " మనము కట్టిన బెడ్ రూంలో భార్య ఉన్నప్పుడు , ఆమె గజేంద్ర మోక్షములోని మకరం . మనము గజేంద్రులము. మొసలి చేతికి చిక్కిన ఏనుగు నీటి మడుగులోనుండి బయటకు రాలేనట్లు, బెడ్ రూమ్ లోని భార్య అనే ఆమె పట్టులో వున్నా వాడు బయటికి రాలేడు. నేను వచ్చాను అంటే నాకు గజేంద్ర మోక్షము వాంటిది దొరికింది . మోక్షాన్ని ఎందుకు కాదనాలో అని అలోచించి ఎవరికీ చెందని ఈ హాల్ లో పడుకుంటున్నాను"

" మూర్తిగారూ దీనికి మోక్షము అనే మాట వాడవచ్చునా ?

"వచ్చును. పడక గదిలో వున్నది కదా అని ఆమె వద్దకు పోయినామే అనుకోండి .. ఆమె "ఛీ పోండి " అనేంత వరకూ అక్కడనే ఉండక తప్పదు. ఆ సమయంలో ఆమె కోరింది కొనక తప్పదు. గదిలోకి పోవటం అంటే గజరాజు మొసలి నోటి పట్టులోకి వెళ్లినట్లు , ఆమె పట్టులోకి వెళ్ళటం తప్ప మరోటికాదు. అదే మనము హాల్లో పడుకొని , ఆమెనే "రమ్మ" అనగా మన దగ్గరికి వచ్చింది అనుకోండి - " అప్పుడు "పొమ్మ" అనటం కూడా " మన

చేతుల్లోనే ఉంటుంది. పైగా ఆమె వచ్చిందా వచ్చింది . రాలేదా రాలేదు . రెండింటిలోనూ సుఖమున్నది . ఇట్లా మన సుఖం మనచేతుల్లోనే ఉండటం మించిన మోక్షమేమున్నాది ?"అని సంజనా మూర్తిగారు నాకు తెలియ పరిచారు అని మీకు తెలియ పరుస్తున్నాను .

అతడు పెధవాయి అనో లేదా పెధవాయి కాదు అనో మీరు ఎదోఒకటి నిర్ధారణ చేయాలి .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కథ

8. నేరమూ శిక్ష **27-02-26**
అట్లా పోయి ఇట్లా వచ్చి చూతును కదా - పిల్లి ఒకటి ఇంట్లోకి దూరి వున్నది . నన్ను చూసి ఎగిరి ఫ్రిజ్జు మీద కు గెంతింది . అమ్మ.. చిక్కిదిరా " మిడతం బొట్లు " అని ఎగిరి ఒక గంతేసి - ముందుగా వంటింటి తలుపు మూసుకుంటూ లోనికి వెళ్లి పాలగిన్నె చక్కగా భద్ర పరిచి - తిరిగి బయటికి వచ్చి తలుపు బిడాయించేసాను. అంటే పిల్లిని భందించేసాను .
" ఇహ ఇప్పుడు నేను బయటికి పోయినానంటే రాత్రి తొమ్మిది కి లోగా ఇంటికి రాను . చస్తుంది ఆ పిల్లి ముండ . ఇంట్లో జొరపడటం అనే నేరానికి తగిన శిక్ష వేసాను .జైల్లో పడ్డ ఖైదీలబుద్ధి తెచ్చుకుంటుంది. ఇక దాని జన్మలో మల్ల ఇలా వంటిళ్లలోకి దూరదు"
అనుకొన్నాను .

నేను బయటికి వెళ్లి చేసుకోవాల్సిన అన్ని పనులూ చేసుకుని రాత్రి ఏడూ కల్లా ఇంటికొచ్చాను - కానీ తలుపులు మాత్రం తొమ్మిదింటికే తెరిచాను . పిల్లికి పడ్డ శిక్ష గాట్టిగా అమలవ్వాలి , అందులో ఏమీ కనికరం లేదు అనుకుంటూ .

తలుపు తెరిచి చూద్దును కదా ? పిల్లి ఇంట్లోని డబ్బాలు అన్నీ కిందకు దొర్లించిది. డబ్బాల్లో వున్నా పిండి నేలను వుంది . ఇది చాలదన్నట్లు ఆ పిల్లి గది నిండా తన మల మూత్రాలను వదిలి ఇల్లంతా నానా కంపు చేసి పెట్టింది . ఇప్పుడు పిల్లిని భందించటం అనే పని చేసినందుకు - దాని మలమూత్రాలు శుభ్రం చేయటం అనే శిక్ష నాకు పడ్డట్లు ఐంది .

దేముడు అంటే అంతే . మనము ఎవరినైతే శిక్షిస్తామో - వారు మనమీద కచ్చ తీర్చుకొనే ప్రకృతి పరమైన సామర్ధ్యం - లేదా అవకాశం ఒసగు తాడు. బదులు తీర్చుకోవాటానికి పనికి వచ్చే సహజ లక్షణం ఎదో పెడతాడు . దీనికి నేల తల్లి లేదా ప్రకృతి ఏ మొదటి ఉదాహరణ . వాటి పట్ల మనము చేసిన నేరాలకు గానూ - అవి మనమీద బదులు తీర్చుకొనే శక్తిని దేముడు వాటికి కల్పిస్తూ ఉంటాడు . మనము చేసే నేరాలకు అవి వేసే శిక్షలను మనం చూస్తూనే ఉంటాము.

సృష్టి మొదలైన నాటి నుండీ - నేటి వరకూ దోమలు చేసిన నేరాలకు గానూ, ,   వాటినికి మనము, లక్షల కోట్ల సార్లు మరణ శిక్ష వేసాము .కానీ   అవి మళ్ళీ శక్తీ పుంజుకొని - మానవులు మురికి ని సృష్టించినందుకు గానూ వారికి వేయవలసిన   శిక్షలు వేస్తూ నే ఉంటవి . "నేరమూ శిక్ష ల మధ్య కల బంధము" అనే దాని మీద దోమలనుండి తెలుసుకోవాలింది ఎంతో వుంది .
వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి - స్వంత కధ.

7. ఫామిలీ డాక్టర్ శివ శంకర్ ర్ MBBS LLB IPS

ఆవిడ ఇంట్లోనుంచి వచ్చి " ఏమండీ ఇటుచూడండి ' అన్నది .ఆమె చీర కొంగు బొడ్లో కి దోపుకొని నిలబడి వున్నది .

" నీ నడుము నీ బోడ్డు చూసి స్పందించే కాలము ఎప్పుడో పోయింది " అని నేను యదార్థాన్ని ఆమెకు భోద పరిచాను .

"మరి వంటి నిండా కొవ్వు పడితే అంతేగా .. మీ పొట్ట చూసుకోండి కుండని కాదని కొండ అవుతున్నది .మీ పొట్ట చూసి నాకు భయంగా వుంది . ఏదన్నా డాక్టర్ కి చూపించు కోద్దాము - బయలు దేరండి అనటానికి గానీ ఇలా చూడండి అన్నాను " అని ఆమె అన్నది .

డాక్టర్ శివ శంకర్ గారు అని మా అమరావతిలో ఒక డాక్టర్ వున్నాడు . మీరు మీ పిల్లాడికి దగ్గు అని అయన వద్దకు తీసుకో పోయారు అనుకోండి , అప్పుడాయన "మీ ఫామిలీని అంటే ఆడోళ్లను తీసుకు రండి - ఆమె ఏ నూనె వాడితే వీడిట్లా దగ్గుతున్నాడో ఇన్వెస్టిగేట్ చేద్దాము . మనము వీడి దగ్గు తగ్గించామంటే - భవిష్యత్ లో మీ ఇంట్లో ఎవరికీ దగ్గు రాకుండా టీకా వేసినట్లే " అని చెపుతాడు. అందువల్ల ఆయన్ని ఫామిలీ డాక్టర్ అంటాము .

నేను ఆవిడా డాక్టర్ దెగ్గరికి వెళ్ళినపుడు ఆమె నా పొట్ట గురించి కంప్లైంట్ చెప్పింది . " ఆమె మాత్రము ఏమన్నా తక్కువనుకున్నారా ? నరాల తీపులంటుంది , నడుము నొప్పులంటుంది , తల త్రిప్పుడు అంటుంది "అని చెప్పాను. అయన ఫామిలీ డాక్టర్ కాబట్టి ఒకే ఫీజులో భర్య భర్తను , చూస్తాడని తెలుసు కాబట్టి ఆలా చెప్పాను . ఆమె మీద ప్రతీకారం కోసం అని కాదు .

“ అమ్మా. మీ మూలకంగానే ఆయన పొట్ట పెరుగుతూ వుండవచ్చు . మీ సన్న తనం చూస్తే - మీరు వండుకున్నది మీరే తినలేకుండా వున్నారని - దాంతో అయన బయటికెళ్లి జంకు ఫుడ్ తింటున్నాడని తీర్మానిస్తాను “అని డాక్టర్ గారు అన్నాడు .

ఇప్పుడు డాక్టర్ గారు ఒక IPS లాగా లాజిక్ లాగి మా ఇద్దరినీ కార్నర్ చేసేసాడు .ఆమె ఫుడ్ ఆమెనే తింటూ ఉంటే ఆమె సన్నగా ఎందుకుండేది ? నేను జంకు ఫుడ్ తినక పోతే నేను కూడా ఆమెలా సన్నగా ఉండాలి కదా ?ఇట్లా గా మేము “కార్నర్ డు” ఐనము

మేము థింక్ చేసుకుంటూ ఉండగానే డాక్టర్ గారు మళ్ళీ ఇట్లా అన్నాడు “ అమ్మా – నరాల తీపు నడుము లో నిప్పు- తల టిప్పు వున్నాయంటే దానికి పోషకాహార లోపమే కారణం . నడుము సన్నగా ఉంచటానికి అని మీరు ఏమీ తింటున్నట్లు లేదు. కాబటికి ఇప్పటినుండీ మీరు పళ్ళు కాయలు జాస్తిగా తింటూ వుండండి . చాలు. ఇక సార్ సంగతికి వస్తే - నోట్లో వేసింది పొట్టలోకి పోయే దానికే సార్ ప్రిఫెరెన్సు ఇస్తారని ఆ పొట్ట చూసి చెప్పా వచ్చు .కానీ ఓ డాక్టర్ గా పొట్టలో వున్నది బయటకు పోవటం మీద నేను ప్రిఫెరెన్సు ఇస్తాను . అందువల్ల సారూ అన్ని రకాల ఆకు కూరలూ జాస్తిగా తింటూ ఉండేది మంచిది “

మేము ఇంటికి వచ్చినాక ఆవిడా ఇట్లా అంది “ అయన LLB చదివి - విడాకులు ఇప్పించే లాయర్ లా మాట్లాడాడు . మీరు ఆకులూ తింటూ ఉంటే నేను పండ్లు ఎలా తింటాను . ఒకే ఇంట్లో వుండే వారు వేరు వేరు తిండ్లు తినటం అంటే - విడాకులకు అప్లై చేసుకున్న భార్య భర్తలు ఒకరిమీద ఒకరు కాలేసి పడుకున్నట్లు ఉంటుంది . ఇది నాకిష్టం లేదు. మీరు తెచ్చినదేదో ఇద్దరమూ పంచుకొని తినాలి . అదే నా సంసారమంటే ”

“ సరే నీ ఇష్టమే నా ఇష్టము . మరి ఏమి చేద్దాము అంటావు ?”

“ అన్ని రకాల పండ్లు అమ్మే వారూ వాటిని పచ్చని ఆకుల పై పేర్చి అమ్ముతూ వుంటారు . మీరు పళ్ళు కొని తెచ్చేటపుడు - ప్రత్యకం అడిగి ఆ ఆకులు పుచ్చుకు రండి . నేను వాటిని కూర చేసి ఇస్తాను . డాక్టర్ చెప్పినట్లు మీరు ఆకు కూరలూ లూ నేను పళ్ళూ తినవచ్చు . మీరు తెచ్చినదే నేనూ , నాకు నచ్చినదే మీరు తిందాము అంటే -నేను జామ పండ్లు తింటూ ఉంటే మీరు జామాకుల కూర , నేను మామిడి పళ్ళు తింటూ ఉంటే మీరు మామిడాకుల కూరా తింటూ ఉండేది . ఇద్దరమూ ఒకే రకం ఫుడ్ ని పంచుకుని తింటున్నాము కాబట్టి మనమేదో విడాకులకు అప్లై చేసుకున్నట్లు అవదు. “

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంతకధ

6.మూల కణం **25-02-25**

నేను తిని బయటికి వస్తున్న హోటల్ ముందు ఒక ముసలిది నుంచొని వుంది . ఎండిన ములక్కాయలా వుంది .అరపై ఏళ్ళు పైబడి ఉండవచ్చును .

నాలా టిఫిన్ తిన్న వాళ్ళు అందరూ బయటికి వస్తూ ఆ ముసలది ఏమీ తిని ఉండదని - ఏమీ తాగివుండదని , దేనికి గతిలేకుండా వున్నదని అలోచించినట్లు ఆమె చేతిలో డబ్బులు పెడుతున్నారు . డబ్బులు ఇచ్చి "టిఫిన్ తిను" అని చెపుతున్నారు . ఇంకొందరు - అంటే ఈ హోటల్ కి ఖాతాదారులు, " ఈమెకు టిఫ్న ఇచ్చి రాసుకో " అని చెప్పి వెళ్లి పోతూ వున్నారు .

ఇట్లా ఉండగా ఎవరో పంతులమ్మగారు అటు పోతూ పోతూ ఆగి, ముసలమ్మకు రొండు చపాతీలు మంచి నీళ్ల బాటిల్ ఇచ్చింది . ఆపై ఆ చెపాతీల బాక్స్ ను అలాగే పట్టుకొని ఆ ముసలమ్మతో " ఇవాళ గురువారం నా పుణ్యం పండింది.తిను ఇంకా ఇస్తాను తిను " అని చెప్పి నుంచుంది . పంతులమ్మ గారు చేసిన తప్పేమిటంటే "ఇప్పుడే - నా ఎదురుగానే తిను" అని డిమాండ్ చేయటం . ఇచ్చిన దానితో సరిపెట్టక - ఇంకా ఇస్తాను అని ప్రామిస్ చేయటం . నలుగురూ ధర్మం చేసే ఈ టైములో తింటూ కూచుంటే ముసలమ్మకు ఎంత నష్టమో ముసలమ్మకు తెలిసినట్లు పంతులమ్మ గారికి తెలియదు కాబట్టి పంతులమ్మ గారు తన డిమాండ్ మీద అట్లా నే నిలబడింది.
ఈ ముసలమ్మ ఆ పంతులమ్మ గారి బాధ పడలేక నే అనుకోవాలి - చటుక్కున కిందన కూర్చుని
తన జోలె బోర్లించి " ఇన్ని వున్నాయి - ఎన్ని తినమంతావూ ?" అని చికాకు పడింది . అవన్నీ టిఫిన్ తిన్నాక ఇంటికి పార్సెల్ కట్టించుకో పెడుతూ వుండే వారు ఇచ్చిన టిఫిన్స్ పొట్లాలు . ఆమె తన చికాకు కొద్దీ జోలె బోర్లించటం వల్ల అందులోనుండి ఫది రూపాయల బిళ్ళలు ఓ ఓ పాతిక - ఫది రూపాయల నోట్లు ఓ యాభై , వంద రూపాయల నోట్లు ఓ ఐదారు బయట పడ్డవి. అంతా కలిపి ఓ వేయి వరకూ ఉండవచ్చు . ఇప్పుడు ఆ ముసలిది " అవసరం లేని ఆ టిఫిన్ లను యెత్తి మళ్ళా జోలెలో వేసుకోవటం "వేస్టు" అని నిర్ణయం తీసుకున్న దానిలాగా , వాటిని అట్లాగే రోడ్డు మీద వదిలి పారేసి, మళ్ళీ లెచి నుంచొని - వచ్చే పోయే వాళ్ళతో " అయ్యా ధర్మం " అన్నది . మీరేమి అనుకుంటారో కానీ ముసలి దాని తెలివి చూడండి " రోడ్డు మీద పడివున్న టిఫిన్లు చూసి , ఇంకెవరూ డబ్బు లు తప్ప టిఫిన్లు జోలిలో వేయరు .ముసలిదే ఆ టిఫిన్స్ ని అట్లా పారేసిందని ఎవరికీ తోచదు కదా ? ఆమెకు కావాల్సిందే అది.
ఇందుకు పంతులమ్మ ఏమనుకున్నదో మనకు తెలీదు. కానీ ముసలిది మాత్రం "పై థిస్ ప్లేన్టీ అఫ్ ఫుడ్ . వెన్ ఐ నీడ్ ప్లేన్టీ అఫ్ మనీ " అనుకోని ఉంటుంది అని ఆమె ముఖ

కవళికలు చదివిన నేను చెప్పగలను . ఫుడ్ చచ్చే వరకే అవసరం . మనీ చావు తరువాత కూడా అవసరం ఆమె తీర్మానం చేసినట్లు నాకు అనిపించింది .

మనుష్యుల మెదడు లోని మూల కణం మీద "పై ప్లేన్టీ అఫ్ ఫుడ్ . వెన్ వుయ్ నీడ్ ప్లేన్టీ అఫ్ మనీ " అని అంటే "ఫుడ్ చచ్చే వరకే అవసరం . మనీ చావు తరువాత కూడా అవసరం" అని రాసి పెట్టి ఉంటుంది అనుకుంటాను .

వారణాసి ఉమా శ్రీ రామకృష్ణ అఫ్ అమరావతి స్వంత కధ .

5.అగ్ని అమ్మకం . 23-02-26

"అగ్ని" అని ఒక క్షిపణిని రూపొందించారు అని తెల్సు కదా ? . దాన్ని అమ్మకానికి పెట్టారా ? అనే సందేహం వద్దు ఎందుకంటే మనము ఈజీగా దేన్ని తయారు చేసి అమ్మగలుగుతామో దాన్నే తయారు చేసి అమ్ముతాము .

అగ్ని హోత్రావధానులు గారు తెలుసుకదా ? ఆయన తన చివరిరోజులకు కొద్ది ముందు రోజులలో
ఇంట్లోని ఒక పాత బియ్యం బస్తా అమ్మి అందులోనుండి రూపాయ ఖర్చుపెట్టి విజయనగరం వెళ్లి ఓ ఫోటో దిగివచ్చాడు . ఇంట్లోని ఆడవారు ఫోటో బ్రహ్మాండంగా వచ్చిందని దాన్ని గోడకు తగిలించారు . ఆ తరువాత ఎప్పటికో అయన గతించాడు. కొన్ని తరాల పాటు ఆ ఫోటో అట్లానే గోడకే ఉండి ఉండి చివర్లో ఎక్కడికో పోయింది .

కాలం కలిసొచ్చి అగ్నిహోత్రావధాన్లు గారి వంశంలో మనుమలు ముని మనుమలు వారికి మళ్ళా మనుమలు ముని మనుమలు పుట్టుకుంటూ వచ్చారు . ఈ పరంపరలో ఇప్పుడు మన కధానాయకుడు ఐన "చిట్టి" అగ్నిహోత్రావధానులు జన్మించాడు . పైసలు అనగా డబ్బు ఘడించటం ఎట్లా అన్న విషయం మీద వాడికి వాడే మార్గదర్శి .. వీడు తన తాతలకు తాత ఐన గోడమీది అగ్నిహోత్రావధాన్లు గారి ఫోటోని ఎక్కడో పాత భోషాణం పెట్టె అడుగున , పాత బట్టల పొత్తిళ్ళలో ఉండగా కనిపెట్టి , దానిని సొమ్ము చేసుకోవాలనే నిర్ణయం చేసుకున్నాడు .

ముందుగా ఆ ఫోటోలోని అగ్నిహోత్రావధానిని బాగా ప్రొజెక్ట్ చేయిస్తూ ఒక ఫ్లెక్సీ వేయించాడు .ఫోటో వేయించాడు . అందులో " నేటికీ రెండు వందల ఏండ్ల క్రితము రాజపూజ్యులు మా తాతాతి తాతగారు ఐన యజ్ఞ శ్రీ అగ్నిహోత్ర అవధాన్లు గార్లు తన యజ్ఞము కోసము వేద శాస్త్ర పురాణాది పద్దతిగా ప్రామాణికమైన అగ్ని ని రగిలించారు . అప్పటినుండి మేము నిత్యాగ్ని హోత్రము చేస్తూ , అప్పటి అగ్ని ఇప్పటి వరకూ కూడా ఆరిపోకుండా రక్షించుతూ వున్నాము . ఈ అగ్ని మీరు జరుపుకొను గృహప్రవేశ హోమములకు అతి విశిష్టమైనది . ఈ అగ్ని

ప్రేతాగ్ని ని రగుల్చుటకు కూడా ఎంతో విశిష్టమైనది . ఈ అగ్ని మూలకంగా దహనము చేయబడిన వారు - తప్పక కైలాసమునకు పోవుదురు అని శాస్త్రములలో రాసి వున్నది . ఈ అగ్ని ని ఒక్కొక్క నిప్పుకణికకు పదివేల నూటపదహార్లు చొప్పున మీకు అందించగలము . మీకు ఎన్ని కావలెనో తెలుపుతూ మాకు వాట్సాప్ చేసి , ఎడ్వాన్సు గా డబ్బు ఫోన్ పే చేసిన వెంటనే మా ప్రాచీన పవిత్ర అగ్గి నిప్పుకణికలను మీకు హాట్ బాక్స్ లో మా మనిషి ద్వారా పంపెదము ."

మీకు గుర్తున్నదా ? అసలు అగ్ని హోత్రావధానులు డబ్బుకోసం అని ఆడపిల్లల గొంతు కోసేవాడు . ఇప్పుడు మన చిట్టి అగ్ని హోత్రావధానులు అట్లాంటివేమీ లేకుండానే జనాల మీద పడి బ్రతకటం మీద కూడా డబ్బు సంపాదించ వచ్చునని నేర్చాడు . ఆంధ్రులందరి మద్దత్తు వలన అగ్నిహోత్రావధాని - తాను కనిపెట్టిన అమ్మకం మీద లక్షలు సంపాదిస్తూ వున్నాడు . "మనవారు ఉట్టి వెధవాయిలోయి " అని గిరీశం వూరికే అనలేదు . "ఇలాంటి వాటికోసం " మనవాళ్ళు ఎంత ఖర్చైనా పట్టించు కోరనే ముందు చూపు కోద్దీన్ అట్లా అన్నాడు .

"మేము నిత్యాగ్ని హోత్రులము - మా తాతల కాలం నాటి అగ్ని ని ఇప్పటికీ కాపాడుకుంటూ వస్తున్నాము అంటూ " ఎవరో ఒకరు - స్వయం లబ్ది కోసం చెపితే - "అట్లయితే అందులో ఎదో వుండే ఉంటుంది . అదేమాకు కావలి . అది మాకివ్వండి ఎంతైనా పర్వాలేదు" అని కోరే పెద్దమనస్కులు ఆంధ్రులలో వుండటము ఆంధ్ర మాత అదృష్టము .
ఇలాంటి వారి మీద గిరీశం గాడు " వెధవాయలు " అనే మాటను ప్రయోగించటము మన దురదృష్టము అని సరిపెట్టు కుందాము .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి సొంత కథ

.

4.“షిహ్ హాటు” అనే కుక్క కథ 22-02-26

థాయిలాండ్ కు చెందిన ఒక వేటగాడు అరణ్యంలోకి వెళ్లి జంతువులను పట్టటానికి ఉచ్చు పన్నాడు .ఉచ్చు పన్నటానికి ప్రత్యేక మైన తెలివి ఏదీ ఉండక్కర్లేదు . తరతరాలుగా తమ పెద్దలు పన్నినట్లే ఉచ్చు పన్నాలన్న ఆలోచన ఉంటే చాలు .

వేటగాడి ఉచ్చులో ఒక వింత ప్రాణి చిక్కింది . ఈ ప్రాణి కి ఐదు కండ్లు నాలుగు చెవులు వున్నాయి . కుక్క పోలికలో ఉంది. దానిని విపణిలో అమ్మితే ఏదైనా డబ్బు రావచ్చు అన్న ఆలోచనతో వేటగాడు ఆ ప్రాణిని తన గుడిసెకి తెచ్చి గుంజకు కట్టి వేసాడు . ఆపై అతడు అన్నానికి కూచునపుడు “ ప్రాణి ఎంత విచిత్రమైనదైనా దానికి ఆకలి వుండటము సర్వ సహజము - ఇది ఏమి తింటుందో ?” అని అలోచించి -అది కుక్కలాగా వుంది కాబట్టి దానికి

మాంసము తింటుంది అని అలోచించి నిప్పు రాజేసి మాంసము ముక్కలను నిప్పుపై కాల్చి వాటినికుక్క ముందు వేసాడు . అప్పుడు ఆ కుక్క మాంసము ముక్కలను వదిలి నిప్పులపై దూకి ఆ నిప్పులు మింగి వేసింది . వేటగాడు దీని గురించి విచిత్ర పడుతూ ఉండగానే - కుక్క తానూ తిన్న దాన్ని విసర్జించింది . విసర్జనద్వారా బయటికి వచ్చిన నిప్పుకణికలు చల్లారిన తరువాత బంగారు కణికలుగా మారాయి .

వేటగాడు ఊరిలోకి వెళ్లి - అక్కడ కనపడిన ఒక బౌద్ధ గురువుతో - తాను ఉచ్చు వేసి పట్టిన వింత ప్రాణి సంగతీ బంగారు కణికల సంగతి చెప్పి ఆయనను తన గుడిసెకు తీసుకొని వచ్చాడు .

"దీని పేరు "షిహ్ హాటు" . బుద్ధ భగవానుని సృష్టి . తాను ఎవరి ఆలోచనలకైనా చిక్కుతాను అని చెప్పటానికి బుద్ధ భగవానుడు ఈ ప్రాణిని నీ ఉచ్చులో పడేటట్లు చేసాడు ." అన్నాడు బౌద్ధ గురువు.

" దీనిని ఏ సింహపు పిల్ల లాగానో , పులి పిల్లలాగానో కాక ఓ కుక్క లాగా ఎందుకు సృష్టించాడు ?

పై ప్రశ్నకు బౌద్ధ గురువు ఇలా చెప్పాడు ."కుక్క తన పుట్టుకతోనే, తనకు ఒక యజమాని ఉంటాడు అని, తాను అతని అదుపాజ్ఞలలో – యాజమాన్యములో బ్రతక వలసిన దానినని,, ఏమి చేసినా యజమాని ఇష్టానికి లోబడే చేయవలిసి ఉంటుంది " అనే జ్ఞ్యానం లేదా స్పృహ కలిగి ఉంటుంది . ఇదేరకంగా మానవుడు కూడా నాకు దేముడు అనే యజమాని వున్నాడు అనే -- జ్ఞ్యానం లేదా స్పృహ కలిగి ప్రవర్తించుతూ వుండాలని చెప్పటానికి అని భగవానుడు ఈ కుక్క రూపం కల్పన చేశారు "

" ఆ నాల్గు చెవులు ఏమిటి ? ఆ ఐదు కన్నులు ఏమిటి " అని ఆసక్తి కొద్దీ అడిగాడు వేటగాడు .

ఆ నాలుగు చెవులు మనుషులు తమ చెవుల ద్వారా ఆచరించ వలసిన మోక్షము గురించి చెబుతున్నవి .
మొదటిగా - చెవులు కలవాడు - దయగల వారు పలికిన వాక్యాలుమాత్రమే వినాలి ,
రెండు -- ఎదుటి వారు సాధించిన విజయాలను విని ఈర్ష్య పడకుండా ఆనందించ గలగాలి .
మూడు -- ఇతరులు తనను దుర్భాషలాడినపుడు దాన్ని విస్మరించాలి .
నాలుగు - ప్రేమ మరియు కరుణతో నిండిన సంగతులని మాత్రమే వింటూ ఉండటం . ఈ నాలుగు చెవుల ద్వారా మానవుడు ఎంతో గొప్ప మానసిక సామర్ధ్యము, గొప్పప్రశాంతత పొందుతారు . దుఃఖము నుండి ముక్తు లవుతారు .దుఃఖము నుండి విముక్తి ఏ మోక్షము ."

.

“ఇక కన్నులు ఉన్నందుకు మనుష్యుడు ఐదు పనులు తప్పక చేయాలి .
మొదట - మనము చూస్తూ ఉండగా ఎవరూ వేదన పడకూడదు. అనగా మనుష్యుడు ఆపన్నులకు సాయం చేయాలి .
రెండు - చూస్తూ చూస్తూ దేన్నీ చంపకూడదు ,
మూడు - ,డబ్బు బంగారం వంటివి ఆసిస్తూ- అవి కనపడినప్పుడు వాటి ని సొంతం చేసుకోవటం ఎలా? అనే దొంగచూపులు చూడకూడదు
నాలుగు - స్త్రీ లను మాయలో పడవేసి మోసం చేసే వారివంకా – స్త్రీ లోలుల వంకా క – మెచ్చు కోలు దృష్టితో చూడకూడదు.
ఐదు - తాగుబోతులు- కూనీ కోరులు వైపు అంగీకార సూచకంగా చూడకూడదు .
ఈ అయిదు దృష్టులు మనిషి కి పనికి రానివి . విసర్జించ వలసినవి . ఈ ఐదు వక్ర దృష్టులు వదిలించుకున్న వారికి ఆత్మని పరిశీలించుకునే శక్తి- మోక్షము సాధించే శక్తీ పెరుగుతుంది .పై ఐదు రకాల కను దృష్టిని అలవర్చుకోవటం ద్వారా భగవానుడైన బుద్ధుని నుండి ఎంతో గొప్ప మానసిక సామర్ధ్యము, గొప్ప ప్రశాంతః పొందుతాము .

“షిహ్ హాటు” అనే ఈ వింత ప్రాణి ఈ నాటికీ . . థాయ్ దేశపు బౌద్ధ సన్యాసులచే ఆరాధింప బడుతూ ఉంటుంది . బుద్ధ బోధనలను అట్టడుగు స్థాయి ప్రజలవరకూ తీసుకో వెళ్లే కృషి లో భాగంగా ఈ “షిహ్ హాటు” రూపము సృష్టి ఐంది అని భావిస్తారు . థాయిలాండ్ లో బౌద్ధ మతము ఈ నాటికి మనుగడలో ఉండటానికి గల కారణాలలో ఈ వింత ప్రాణి కూడా ఒక కారణము .

ఐదు కండ్లు నాలుగు చెవులు కల ఈ “షిహ్ హాటు” అనే ఒక వింత ప్రాణి ని ఏ సింహ్ లాగానో పులి లాగానో కాక - ఒక కుక్క పోలికతో ఎందుకు వుంది ? అనే విషయము మీద మరింత వివరణ లభ్యము అవుతున్నది . సింహ్‌నికి లేదా పులికి తనకు ఒక యజమాని ఉండటం ఇష్టం ఉండదు . ఒక వేళా వున్నా అవి వారిని మనః పూర్తిగా తమ యజమాని గా ఆమోదించవు . వాటి ఇష్టానికి భంగము కలిగినపుడు అవి తమ సహజ క్రూర స్వభావంతో, ప్రవర్తిస్తాయి. తమకు తిండి పెట్టిన వాడినే వ్యతిరేకిస్తాయి . మనుష్యులు కూడా ఇంతే . తమ ఇష్టానికి వ్యతిరేకంగా ఏదన్నా జరిగితే వారు తమ యజమాని ఐన దేముని మీద కూడా తిరగ పడతారు . కానీ మనుషులు మేము దేముని దృష్టిలో కుక్క వంటి వారము, నేను నా దేముడు అనే యజమానికి లోబడిఉండాలి అంతా అయన ఇష్టప్రకారమే జరగాలి అనే స్వభావాన్ని వృద్ధి చేసుకుంటూ ఉన్నవారు మాత్రమే మోక్షం సాధిస్తారు అని థాయ్ బౌద్ధము ప్రతిపాదించింది .

వివరణ - సమర్పణ వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి

3.నెక్కు ఆపరేషన్ 5-12-20 తిరిగి 19-02-26

నేను వెళ్లిన సమయానికి కి - ఫోన్లో ఇలా మాట్లాడుతున్నాడు మా చిన్నన్నయ్య . మా వదిన వినటానికి వీలుగా కాబోలు స్పీకర్ పెట్టి ఉంచాడు .

" ఆమ్మా .. మా అబ్బాయి సంభందాన్ని రిజెక్ట్ చేశారు . మాకు ప్రాప్తంలేదు అనుకుంటాము . సరే మీరు కాదన్నందుకు మా అదృష్టాన్ని మేము నిందించుకుంటాం . కానీ ఏ కారణం తో మా సంభందాన్ని వద్దన్నారో తెలిస్తే .. మేము ఆ తప్పు సవరించుకొని మరో సంభందం వెతుక్కోని సక్సెస్ అవటానికి వీలవుతుంది . మీ పుణ్యం వూరికే పోదు "

అవతల నుండి ఇలా విన వచ్చింది .
" అబ్బాయిది కురచ మెడ . పెళ్లయినాక అమ్మాయి అబ్బాయి బండి వెనక కూర్చుని అబ్బాయి భుజం మీద గడ్డం ఆనించి , రోడ్డు మీదకు చూస్తూ లైఫ్ ను ఎంజాయి చేయటంలో ఇబ్బంది పడచ్చు నని తోచి మీ సంభందం ఒద్దనుకున్నాము .అంతకు మించి ఏమిలేదు " అని అవతలి ఆమె తప్పుక్కిని ఫోన్ కట్ చేసింది .

" చూడు నీకురచ మెడ నీకొడుక్కొచ్చింది . అదే వాడి పెళ్ళికి అడ్డం వచ్చింది . " అని మా వదిన మీద ఎగిరాడు అన్నయ్య . అత్త మీద కోపం దుత్త మీద చూపటం అంటే ఇదే .

" ఇప్పుడు నా మీద యెగిరి ఎం లాభం? ఏదన్న ఉపాయం చూడండీ -- మన వాడి నెక్కుకు ఏదన్నా ఆపరేషన్ చేసి, వాడి మెడ పొడుగు ఓ మూడు అంగుళాలు పెంచే హాస్పిటల్స్ ఉన్నాయేమో వెతకండి " అని కర్తవ్య బోధ చేసింది మా వదిన .

ఇప్పుడు నేను ఇందులో జోక్యం చేసుకుని " అన్నయ్యా .. అబ్బయిల పంట బాగా పండిన రోజుల్లో ..మధ్య వర్తులు మోగా పిల్ల వారితో ఇలా చెప్పేవారు —-
" అమ్మాయి ది కురచ మెడ అంటున్నారా ? భలే వారే . అలంటి పిల్లలు దొరకటం అరుదు .కురచ మెడ వున్నా పిల్లకు తాళి గట్టి అని చెప్పి పెళ్లి సానుకూలం చేసేవారు . అదే అమ్మాయికి పొడుగు మెడ ఉంటే
" ఏంటి అమ్మాయి ది కొంగ మెడ అంటున్నారా ? భలే వారే . అలాంటి పిల్లలు దొరకటం ఎంతో అరుదు .కొంగ మెడ వున్న పిల్లకు మెడ నిండా నగలు అమురుతాయని శాస్త్రంలో రాసి పెట్టి వుంది . మీరు అన్ని నగలు ఎట్లా చేయిస్తారు ? ఆపిల్లను చేసుకుంటే మీకు కోట్లు కలిసి వచ్చి అప్పుడు కదా అన్ని నగలు చేయిస్తారు ? ఇట్లా చూస్తే ? ఆమెకు కొంగ మెడ ఉండటం మీకు కలిసొచ్చే విషయమేగా ? కాబట్టి కొంగ మెడ అంటూ నడిచొచ్చే అదృష్టాన్ని మోకాలు అడ్డొద్దు" అని చెప్పి పెళ్లి సానుకూలం చేసేవారు .

" కానీ తమ్ముడూ ఇవి అమ్మాయిల పంట పండుతున్న రోజులు గదా ? నువ్వు చెప్పిందే చెబుదామంటే మొగపిల్ల వాడికి తాళి ఉండదు - నగలు వుండవు కదా ?

" అన్నా అట్లా కాదు ఇట్లా చెప్పు . కురచ మెడ వున్న అబ్బాయికి , గట్టి జీతంతో గట్టి జాబు రాసి పెట్టి ఉంటుంది . ప్రపంచం కొట్టుకు పోయినా మావాడి జాబు మాత్రం ఎక్కడికి పోదు . " అంటూ వుండు . మీవాడి పెళ్లి జరుగుతుంది "

" ఇంకొక రెవరో వచ్చి మా వాడిది పొడుగు మెడ అంటే అప్పుడు మేము ఏమి చెప్పుకోవాలి ?" అని అడిగింది మావదిన .ఆమె మేనల్లుడిది కొంగ మెడ. కొడుకు కోసం కాక అతడికోసం ఈ ప్రశ్న అడిగింది

" వదినా కొంగ మెడ వున్నా మొగవాడు - ఆలిని విమానాలెక్కించి విదేశాలన్నీ చూపిస్తాడు " అని చెప్పు. కొంగ మెడ వున్నా పిల్లడు కొంగలాగా ఎక్కువ కాలం ఆకాశ ప్రయాణాలలో గడుపుతాడని శాస్త్రాలలో రాసి ఉందని చెప్పు . మా అబ్బాయి ఆకాశం లో తిరుగుతూ మీఅమ్మాయిని కూడా ఆకాశం లో తిప్పక ఏంచేస్తాడు ? అని ప్రశ్నించు. లక్ష్మి నారాయణులు గరుత్మంతుడిని ఎక్కి విహరించి నట్లు మీ అమ్మాయి మా అబ్బాయి తిరుగుతారు అని పోల్చి చెప్పు . పని జరుగుతుంది" అని చెప్పాను .

ఏదో చెప్పాలనిపించి చెప్పాను . అన్న వదిన అంత గా పట్టించుకుంటారు అనుకోను . మా అన్న తన కొడుకికి సెక్కు దెగ్గర ఆపరేషన్ చేయించి వాడి మెడ పొడుగు మూడంగుళాలు పెంపు చేయించి - “అబ్బాయిది కురుచ మెడ “ అని ఓంకా పెట్టిన వారి తో మళ్ళా సంప్రదింపులు మొదలెట్టాడు . మా ఒదిన గారి మేనల్లుడి పెళ్లి నేను చెప్పిన మాటల వల్లనే జరిగింది కానీ ఆ సంగతి మీకు తేలీదు .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కధ

2.వాస్తవానికి ఆమడ దూరంలో 5-12-20 మరల 17-02-26

అత్తా కోడళ్ళు విడివిడిగా ఎవరి సోఫాలో వారు కూర్చొని వున్నారు . కానీ విధి బలవత్తరమైన దైనందువలన ఇద్దరూ కలిసి ఒకే టీవీలో , ఇద్దరికీ ఇష్టమైన అదే సీరియల్ చూస్తున్నారు

కోడలి చేతిలో రిమోట్ వుంది . అత్త చేతి కి అందుబాటులో కరెంట్ స్విచ్ బోర్డు వుంది . టీవీ కి వెళ్లే కరెంటును ఆన్ /ఆఫ్ చేసే స్విచ్ ఈ స్విచ్ బోర్డు లో వుంది . టీవీ ని బంధు చేసే

అవకాశాలు చెరి సగంగా ఉన్నందువల్ల ఇద్దరూ సమ దృష్టితో సీరియల్ని ఆస్వాదిస్తున్నారు
.

ఇప్పటికే టీవీ సీరియల్ లోని కొన్ని స్త్రీ పాత్రలకు కరోనా వచ్చివుంది .
“కరోనా సోకి కోడలు చచ్చినట్లు , అత్తగారు కోలుకున్నట్లు , కోలుకుని కొడుక్కోసం మరోమంచి సంభందం ఖాయం పరిచినట్లు ఏ ఎపిసోడులో చూపిస్తారో ఏమో ? మహా సాగదీసి వాస్తవానికి ఆమడ దూరంలో నడిపిస్తుంటారు ఏమి సీరియల్స్లో ఏమిటోను ? " అని అత్త గారు అనుకుంది .

" కరోనాతో అత్త గారు ఐసోలేషన్ వార్డులో చేరినట్లు , ఆమె అటునుండి ఆటే కైలాసానికి పోయినట్లు , బాడీ ని కూడా ఇంటికి ఇవ్వకుండా - డైరెక్టుగా వాళ్ళే దహనం చేసి చితా భస్మాన్ని ఇంటికి పంపినట్లు ఏ ఎపిసోడులో చూపిస్తారో?.ఈ వెధవ సీరియలు ? వాస్తవానికి ఆమడ దూరంలో నడుస్తూ ఉంటుంది "అని కోడలు అనుకుంది.

వారణాసి ఉమా శ్రీరామా కృష్ణ అఫ్ అమరావతి స్వంత కధలు

1.ఈ కేసులోని నీతి **13-12-22** మరల **16-02-26**

తాల్లూరి కాంతారావుగారిని అందరూ తగాదాల కాంతారావు గారు అంటారు . దేని మీదనైనా సరే - తగాదాలు పడటం లోనూ , పట్టు విడవకుండా పోట్లాడటంలోనూ -పిచ్చి పట్టు పట్టటం లోనూ ఈయన తరువాతనే ఎవరైనా . నేటి సమాజంలో ఇలాంటి వారు కోకొల్లలుగా వున్నారు కాబట్టి ఈయన కధ మనము తెల్సుకోవాల్సి వచ్చింది .

ప్రస్తుతం, టీ కే రావుగారు - ఒక చిన్న పల్లెటూరు రైల్వే స్టేషన్ లో - అక్కడి స్టేషన్ మాస్టర్ తో తగాదా పడుతున్నాడు . రైలు సకాలంలో స్టేషన్ లోకి రాలేదు . “దానికి నీ అసమర్థతే కారణము” అంటూ , రెట్టించి రెట్టించి ఆరోపణ చేస్తూ స్టేషన్ మాస్టారితో తగాదా - లాగుతూ ఉన్నాడుటీ కే రావు గారు.
.
అసలు ఏమి జరిగిందంటే ..ఫలానా రైలు సాకాలంలో వస్తున్నదని ప్రకటించారు . కానీ అనుకున్నట్లుగా రైలు రాలేదు . స్టేషన్ లో నిలబడి ఎదురు చూపులు చూస్తున్నవారికి దూరంలో రైలు కనబడుతోంది కానీ అది స్టేషన్ లోకి రావటం లేదు. చివరికి ట్రైన్ “టైం టేబుల్ “లో చూపిన సమయాన్ని మించి ఒక గంట పాటు అక్కడే అలాగే వుంది .ఈలోపుగా మన

టీకే రావుగారు ప్రతి పది నిమిషాలకు ఒక సారి ఎదో తెలియని ఆవేశం తో వెళ్లి స్టేషన్ మాస్టారుని కెలికి రాసాగాడు . నిండా ఒక గంట కాగానే - మైండ్లో ఎదో భూకంపము వచ్చినంత వీరావేశంతో వెళ్లి " టైం టేబుల్ ప్రకారం రైలును సకాలంలో ప్లాట్ఫారం మీదకు తీసుకో రాకుండా మీరేమి చేస్తున్నారండి ? గాడిదలు
కాస్తున్నారా ?? అని ఆ స్టేషన్ మాస్టర్ మీద ఎగిరి పడ్డాడు .

చోద్యంచూస్తున్న కొంత మంది ఈయనకు వెనుకగా వచ్చారు . వారిని చూసి -ఈయన మరింతగా తన మాటల జోరు పెంచాడు . వివాదాన్ని పెద్దది చేసాడు. టైం టేబుల్ ప్రకారం రైలును స్టేషన్లోకి తీసుకు రాలేని వాడివి నీవు ఈ వుద్యోగానికి అన్ఫిట్ వి అన్నాడు . నూవ్వు దేనికీ పనికి రాని యూజ్ లెస్ ఫెలోవి - అని నిందించాడు .

జరుగుతున్న ఆలస్యానికి పిచ్చెక్కి పోతున్న జనం మధ్య, వున్నా స్టేషన్ మాస్టర్ ఆ ఒత్తిడికి తట్టుకోలేక తాను కూడా పిచ్చెత్తి పోతున్నాడు .

ఈ గుంపును చూసి అక్కడికి వచ్చిన ఒక పోలీసు ఆయనతో - " ఈ యన నా విధులకు ఆటంకం కలిగిస్తున్నాడు - ఈయన్ను తీసుకెళ్లి ఆ ప్లాట్ఫారం చివర కూచో పెట్టండి" అని ఆర్డర్ వేసాడు స్టేషన్ మాస్టర్ . పోలీసు అయన టీ కె రావు గారిని జబ్బపట్టి బయటికి తీసుకో వెళ్ళాడు .

ఇప్పుడు చూద్దాము, అసలు రైలు ఆలస్యానికి కారణం ఏమిటి? అనేది . రైలు స్టేషన్ని సమీపిస్తుండగా - ఒక దున్న పోతు దానికి గుద్దుకొని చని పోయింది . దాని రక్తం - ఇంకా దాని మాంస ఖండాలు ఇంజిన్ ముందు భాగం పైకి వెదజల్లబడి -రైలింజను ముఖము అంతా భయంకరంగా తయారయ్యింది . ఈ భయానకమైన ఇంజను చూసి ప్లాట్ఫారం మీద వుండే పాసెంజర్లు ఏమి ఇబ్బంది పడతారో ఏమో మోనని ఆలోచించిన రైలు డ్రైవర్ , ఇతర రైల్వే సిబ్బంది తో కలిసి ఇంజెన్ని శుభ్రం చేయటంలో-కాలాన్ని ఖర్చు చేసి రైలును , ప్లాట్ఫారం మీదకు తీసుకు రావటం వాళ్ళ రైలు ఒక గంట ఆలస్యం గా పల్టఫార్మ్ మీదకు వచ్చింది . అదీ సంగతి .

సరే, రైలు మొత్తానికి ప్లాట్ఫారం మీదకి వచ్చింది - పోయింది. కానీ టీకే రావు గారు మాత్రం రైలు ఎక్కలేదు . పోలీసు ఆయన " వెళ్ళండి మాస్టారు - రైలు ఎక్కేయండి " అనిరావు గారిని ప్రోత్సహించినా , బ్రతిమాలినా కానీ రావు గారు రైలు ఎక్కలేదు . పైగా స్టేషన్ మాస్టర్ వచ్చి నాకు ఆపాలజీ చెప్పాలని " డిమాండ్ లేవదీశాడు . అంటే ఈయన వివాదాన్ని కొత్త పుంతలు తొక్కించాడు అని . ఆ తరువాత " మీ స్టేషన్ మాస్టర్ నన్ను రైలు ఎక్కనివ్వలేదు " అని పై అధికారులకి టెలిగ్రాంలు కొట్టాడు .అంటే తనకు క్షమాపణ కావాలని పిచ్చి పట్టుకు దిగాడు అని .

టీకే రావుగారి కంప్లైంట్ వల్లనూ , అసలేమీ జరిగిందో తెలుసుకుని , స్టేషన్ మాస్టర్ మీదచర్య తీసుకొనే దానికని, . ఒక ఎంక్వయిరీ కమిటీ వచ్చింది . ఒక సిట్టింగ్ జడ్జీ గారు దానికి ముఖ్య విచారణ అధికారి .
అసలు రైలు ఎందుకు ఆలస్యం ఐయ్యిందన్నది, టీ కె రావుగారిగికి తెలుస్తూనే వుంది . కానీ ఈయన వెనక్కి తగ్గేదేలే .. అని కూచున్నాడు . " సార్ ఇదీ రైలు లేటుకు కారణం అని, సారీ ఫర్ ది లేట్ అని - అతడు అప్పుడే వచ్చి నాకు పోలైటు గా నాకు సారీ చెప్పి వుండ వలసింది . అతడు ఆలా చెప్పలేదు - అదే ఇక్కడ ఇష్యూ . ఈ లేటుకు ఎవరు భాధ్యులో తెలుసుకోవటం ఓ పౌరునిగా నా భాధ్యత " అని వాదనలు పెంచుతూ వున్నాడు .

"ఐన దానికి కానీ దానికివాదులాటకి దిగి యెదుటవారిదే తప్పు అని ఎంచుతూ - ఎదుట వారు "సారీ"చెప్పని దాకా వదలని వారు కొందరుంటారు . సారీ చెప్పించుకోవటం వారి దృష్టిలోఏదో ఒక ఘన విజయం. ఇలాంటి వారు కోకొల్లలుగా వుంటారు " అని, కేసు స్టడీ చేసిన జడ్జీ గారు అనుకున్నారు.

అప్పుడు జడ్జీ గారు " అసలు మీ టైం టేబుల్ ఏమిటి ?" అని రావుగారినిప్రశ్నించాడు

రావుగారు తన దిన చెర్యను ఏకరువు పెట్టాడు .

" ఆబ్బె అది కాదు ..ఏ వేళప్పుడు ఏమి మందులు వేసుకోవాలి ?ఎంత తినాలి ? ..ఏమి తినాలి ?.. ఎంతలో ఎంత ఉప్పు ఉండాలి -అని చెపుతూ డాక్టర్ మీకేమీ టైం టేబుల్ ఇవ్వలేదా ? దాన్ని గురించి అడుగుతున్నాను " అన్నారు జడ్జి గారు.

నిజానికి టీ కె రావు గారు కి, ఆయన డాక్టార్ గారు ఒక టైం టేబుల్ ఇచ్చే వున్నాడు . కానీ ఈయన దాన్ని అమలు చేసిందే లేదు .అందువల్ల నోరు పెగల్చ లేకపోయాడు .

అప్పుడు జడ్జీ గారు " కేసును నెలరోజులు వాయిదా వేస్తూ వున్నాను . ఈ నెల కాలం పాటు- ఈ టీకే రావు గారి ని - ప్రభుత్వ డాక్టర్ గారు తమ హాస్పిటల్ లోని , ఓ స్పెషల్ గదిలో ఉంచి - మెడికల్ ప్రకారం ఒక వ్యక్తి రోజు ఎంత అన్నం తినాలో అంతే కొలత - అలాగే, మెడికల్ ప్రకారం మనిషికి దినమూ ఎంత ఉప్పు అవసరమో అంతే కొలత ప్రకారం ఉప్పు వేసిన కూరలతో భోజనం పెట్టి - ఇతడికి మెడికల్ టైం టేబుల్ అమలు చేయాలి అని ఆదేశిస్తూ కేసును వాయిదా వేస్తూ వున్నాను " అని జడ్జీ గారు అన్నాడు

నెల రోజుల తరువాతి వాయిదాలో " నాకెవరి క్షమాపణలూ అక్కరలేదు - ఐ యాంవెరీ సారీ " అన్నాడు - మన టీ కె రావూ గారు . ఉప్పు తగ్గితే కానీ బీపీ తగ్గదు . బీపీ తగ్గితే గానీ తిక్క తగ్గదు . .తిక్కతగ్గితే కానీపట్టు తగ్గదు . పట్టు తగ్గితే కానీ వాదాలు - జగడాలు తగ్గవు అన్న సిద్ధాంతం ప్రకారం ఇప్పుడన్నీ వాటికవే సర్దై పోయాయి . ప్రతి కేసులోనూ ఇట్లా చేస్తే , ఇక లోకం అంతా ఎంతో హాయిగా ఉంటుంది అనేదే ఈ కేసులోని నీతి .

వారణాసి ఉమా శ్రీ రామ కృష్ణ అఫ్ అమరావతి స్వంత కధ